రూపకం

# అవతలిగట్టు

అంగర వెంకటకృష్ణారావు

అన్వేషి ఒకమార్గం మీంచిపోతూంటాడు:

'పరమేశ్వరా! ఎక్కడున్నావు తండ్రీ! ఎలా వున్నావు! ఈ ప్రపంచంఅంటే నాకు అసహ్యం కలుగుతూంది. అనంతమైన యీ మార్గంలో ఎడతెగని ప్రయాణంచేసి, చివరికి నిన్ను చేరలేక పోతానా? కాని నాకు కావలసింది ఒక్కటి! ఈ రహదారి అనేకచోట్ల అనేక చీలికలయింది. ఏ మార్గం సుగమమో తెలుసుకోవడం కష్టంగా వుంది. (దీర్ఘనిశ్వాసం) సరే కానీ...ఎప్పటికైనా సుమార్గం లభించదా'—

(దారిపక్కని పాట)

"మాయఘుట మిది, మాయఘుట
మిది–నమ్మ బోకన్నా"

అన్వే :-ఏమితత్వం...ఏమి వేదాంతం ...... మాయఘుటం...బొక్కికుండ యీ శరీరం...తెలియని మానవుడు దీనిలోనే ఆనందసౌధాలు కట్టుకుని మురిసిపోతాడు.

(పాట)

"పోయేనాటికి వెంటరాదు
ఒక పుచ్చిన వక్కైనా"

అన్వే :-నిజంనిజం! ఏం నిత్యం-పోయిన కుండలో నీరు ఎంత నిత్యమో, ఈ ధనధాన్యాలు, బంధుమిత్రులూ అంతే. ఈ కార్మికుడు ఎంత ధన్యుడు! ఈ దీపపు శెమ్మెనే భగవంతుడు అనుకుని భక్తి పారవశ్యంలో, గంభీర వేదాంతంలో మునిగిపోయాడు. తండ్రీ! నిన్ను చూస్తే నాశరీరం పులకరించిపోతూంది. నీ మూఢ భక్తి అతిపవిత్రం- నిర్మలం! నీకు ఈశ్వరదర్శనం ఔతూందిలా వుంది.

భక్తుడు :-నిజం నిజం.

అన్వే :-(ఆత్రుత) ఈశ్వరు డెలావున్నాడు నాయనా!

భ :-(ఈడుపుమాటలు) ఈ పెపంచం అంతా మాయ- ఎరికా?

అన్వే :-నిజం- నీ మూఢభక్తిలో ఎంత తత్వం వుంది! నీమార్గం నాకు కూడా సుగమంలా వుంది. నాగురించి ఈశ్వరుడికి తెలియజెయ్యవా తండ్రీ!

భ :-మరిగాదా! (ఈడుపుమాటలు) బెమ్మం అంతటూవున్నాడు-కోటిమందినా నాకు కనిపిస్తూన్నాడు...మాటికి నీకు పన్నెండు బుఱ్ఱలున్నాయినా కనిపిస్తూంది.

అన్వే :-ఔను తండ్రీ...ఇవి పన్నెండురకాల మార్గాలు పోతూన్నాయి. ఎలావెడితే ఈశ్వరుడు దొరుకుతాడో తెలియదు.

భ :-'మాయఘుటమిది నమ్మబోకన్నా' అడిగో ఈస్వరుడు...పట్టినామాలెట్టుకొని ... పచ్చిమీద ఎలిపోతున్నాడు...నీకు కానరాడూ అతగాడు? (మరీ యీడుపుమాటలు) పాపాత్ములకి కానరాడు ...మరిగాని నువ్వు కాళ్ళతోనా బుఱ్ఱతోనా నడుత్తూంట?

అన్వే :-అబ్బబ్బ! ఏమిటీ దుర్వాసన! రామ రామ! కల్లుకంపు...ఇక్కడ నిలవలేను.

భ:- ఓయ్ పెద్దమనిసీ...నీకు దేవుడు కనుపించాలా? పలకవేం? ఉఁ?...ఇదిగో ఈ సీసాలో వున్నాడు—ఇంద ... యిదితాగి .. ఒక్కదమ్ము నాగి...సూడుమరి నాలాగ (సీరియస్‌గా)'మాయఘుటమిది...మాయఘుటమిది నమ్మబోకన్నా' అని పాడితివట్టైనా, చిటంలో దేముడౌపిస్తాడు. పారిపోతావేం దయ్యా...నాకేం, అంత దేముణ్ణీ నేనే తాగేత్తాను.

అన్వే:-రామ రామ! తప్పుదారి తొక్కాను. ఇదికాదు మోక్షగేహానికి సరియైనత్రోవ. దుర్వాసన! తండ్రీ నిన్నెలా పోల్చుకోవడం...కానీ యింతటితో ప్రయాణం ఆపుతాననుకున్నావా?

ఈ ఘోర ప్రపంచంమీద మోజుపడతానను కున్నావా?

(ఎదురుగా పదిమంది కలిసిపాడుతూన్నట్టు విని పిస్తుంది)

(పాట)

"ప్రేమావతారా! పాలింపవేరా!
ప్రణయస్వరూపా! కరుణింపవేరా!"

అన్వే:- అహాహా! ఎంత తియ్యగావుందీపాట! ఎంత మనోరంజకంగావుంది. వీరితోకలిసి ప్రణయ రాగం ఆలపిస్తే ఈశ్వరదర్శనం ఔతుంది. మధ్యని ఏదో దివ్యమూర్తిపటం అగుపిస్తూంది. ఏమి కళాపరిపూర్ణత!

(పాట)

"కరుణానిధానా-
దరిజేర్పవేరా" (పునఃపునః)

అన్వే:- ఈ నేత్రాలలో కరుణరసం ఒలుకు తూంది. చిత్రం అయినప్పటికి దీని పెదవుల్లో ఒక దయాపూర్వకమయిన, ఆహ్వానసూచకమైన చలనం గోచరిస్తూంది.

కలికాలంలోనామసంకీర్తననిమించి ఏమీఅవస రంలేదు కదా... నేనూ పాడతాను... గొంతు బ్రద్దలయ్యేవరకూ ఆలపిస్తాను... శరీరం వుడుకెత్తే వరకూ నాట్యంచేస్తాను... కళ్లు పొతుకుపొయ్యే వరకూ అశ్రువులుకారుస్తాను (వెఱ్ఱిగా) 'కరుణా నిధానా...దరిజేర్పవేరా'...అబ్బ! గొంతు పగిలి పోయింది... కాళ్లు తేలిపోయాయి. కళ్లు పేలిపో తూన్నాయి.

ఆశ్చర్యం! ఆశ్చర్యం! ఎక్కడనించి వచ్చింది యీ వట్టివేరు గమగమగాలి! నా శరీరంమీద చందనం ఎవరుపూశారు? మెడలో మల్లికాదామం —ఎలావచ్చింది! నానోట్లో మధువువాకలు పరు గెడుతున్నాయి. ఏడీ ప్రేమావతారుడు...ఏదీ కరుణానిధానం! నా మనస్సును ఏదో పెద్దపాశం పట్టి లాగుతూంది! ఎక్కడకు లాగుతూంది! అయ్యో...లో తెరగని సముద్రంలోకి. మోసం మోసం! గొప్పమోసం ... తప్పుదారి... తండ్రీ ఇంతవరకూ నీదే జయం...ఇంక నీఆటలు సాగవు.

నడిచినడిచి అలిసిపొయ్యాను. ఇక్కడ ఏదో యిల్లులావుంది. అరుగుమీద విశ్రమించి తెల్ల వారేక తిరిగి ప్రయాణం సాగిస్తాను. ఉండుండు! దీనిలోంచి ఏదో మధురమైన గానం వినవస్తూంది. ఎంతశాంతిదాయకంగా వుంది!

[పాట)

"ఇదేకదా సువార్త...
ఇంపైన యేసువార్త"

పాస్టర్:-బిడ్డలారా! ఒక్కసారి మీ మన స్సులతో యీ నిరవకాశమైన ఆకాశం లోకి చూడండి. రంగురంగు నక్షత్ర దీపాలనడుమ వెలిగే శక్తిని గమనించండి. మీ శరీరనాళాల్లో పరుగెత్తే ప్రతి రక్తబిందువు ప్రభువు తన బిడ్డలకోసం ధారపోసిన స్వీయ రుధిరం. మన హృత్పిండాలన్నీ ఆప్రభువు బ్రద్దలు కొట్టుకున్న గుండెముక్కలని గ్రహించి ఎవ్వడైతే తన సర్వస్వమూ తోడిమానవులకోసం వినియో గిస్తాడో వాడే ఆ ప్రభువును తన వాడిగా చేసుకో గలుగుతాడు...స్వార్థత్యాగం-దయా భిక్ష - విశ్వ మానవ సౌభ్రాతృత్వం ప్రభు ముఖ్య ఆశయాలు.

అన్వే:-ధన్యోస్మి ధన్యోస్మి! ఇది నిజంగా శాంతినికేతనం. హరిశ్చంద్రునిజిహ్వ, రంతిదేవుడి దక్షిణహస్తం, శిబిచక్రవర్తి శరీరం, బలి సర్వస్వం యీసిలువమీద మేకుబందీచెయ్యబడ్డాయి. నాలుగు దిక్కులకూ వ్రేలుపెట్టిచూపే యీసిలువ ప్రభువు సర్వాంతర్యామిత్వం సూచిస్తూంది. ఈ త్రోవ చక్కని పూలబాట...ప్రభూ నన్ను నీలో చేర్చు కోవా! అదిగో! మతాధికారి యిటే వస్తూన్నాడు. ఈ మహాత్ముడితో పరిచయం చెయ్యడం సర్వ శ్రేయస్కరం.

(దారిప్రక్క పాట)

"కళ్లు కాళ్లూలేవు నారాయణ-
గంజి చుక్కాలేదు నారాయణా-"

బాబా!మూడురోజులనుంచీ ఒక్క కబళమైనా లేదు-ఆకలిపురుగు పేగులు కొరికేస్తూంది. ఒక్క మెతుకు పెట్టించు నాయనా.

పాస్టర్:-అలాగే అలాగే! నీకోసం యింటి దగ్గర పంచభక్ష్య పరమాన్నాలూ వండించేను. కడుపెక్క మెక్కుదువుగాని...ఏం!

భి:- బాబా...తమరు దేవుడంతవారు.

పా:-ఔనౌను...మాకు మిషన్‌వాళ్లు యిచ్చే జీతం అంతా నీలాటి సోమరిపోతులకి పంచిపెట్ట మనేరాసివుంది.

అన్వే:-అయ్యో ... స్వార్థత్యాగి యిలా మాట్లాడుతున్నాడేం? కానీ ఇంకా చూదాం.

భి:- తండ్రీ! ఒక్క అణాడబ్బులు దయచేస్తే కాఫీత్రాగి యీ రాత్రికి ప్రాణాన్ని కాపాడుకుంటాను.

పా:- అణాలు మార్చుకు కూచున్నా నీకోసం. పోరా పోరా...దుక్కలావున్నావు...కూలీ చేసుకోరా...రోగ్స్! ఐడ్లర్స్!

అన్వే:- పరమేశ్వరా! నా మార్గంలో ముళ్ళ కంచెలు విసురుతున్నావా! ఈ మతాధికారి గుడిలో మతాధికారం-లోకంలోస్వార్థం చలాయించడానికేనా!

పా:- తలుపు తలుపు! పలకవేం...ఎవడ్రా అరుగుమీద...ఊఁ పలకవేం!

ఒకడు:- బాబూ! పొరుగూరు వాడిని...చీకటి పడిపోయింది...పడుకున్నాను.

పా:- దొంగ, పచ్చిదొంగ! సగం రాత్రివరకూ బాటసారి...ఆ వెనక దగాఖోర్! దగుల్బాజీ.

ఒకడు:- లేదు లేదుబాబు! తెలతెలవారుతూంటే లేచి పోతాను. దొంగనికాను బాబూ.

పా:- డామ్ రోగ్! గుమ్మందిగావా లేదా... లేకపోతే యీ బూటుతో తన్నమన్నావా...

అన్వే:- పచ్చటితోరణాలుకట్టిన పానశాలని పవిత్రమందిరంగా భ్రమసివచ్చాను. తండ్రీ! నువ్వు నివసించేస్థలం సుగంధ పుష్పాలతో అలంకరించుకుని దారిలో బ్రహ్మచెముడు డొంకలు నింపావు-సరే యిప్పుడేంపోయింది? ఇకనైనా మంచిమార్గం లభించదా? కాని నా కాళ్లు లాగుతున్నాయి.నిద్ర వస్తూంది. ఎక్కడ విశ్రమించను! చీకటిదట్టంగా క్రమ్ముకుంది. ఇక్కడఏదో మఠంలావుంది. ఈ పంచపాళీమీద పడుంటాను. (ఆవలించి) పరమేశ్వరా! ఎవరక్కడ తండ్రీ!

సన్యాసి:—నే నెవరనిచెప్పేది!

అన్వే:-......

స:- నన్ను బుద్ధుడు అంటారు.

అన్వే:- చీకటిలో గుర్తు ఆనలేదు...సన్యాసులా?

స:- కావచ్చును.

అన్వే :-చిత్తం...ఇక్కడ పడుకోవచ్చా!

స :-నాయనా— నిర్మలమైన మనస్సుతో— అహింసావ్రతంపట్టి—లోకకళ్యాణ తపస్సమాధిలో పడిన వ్యక్తికి పడుకోరాని చోటులేదు—సాధారణ మానవునికి భయంకొలిపే శ్మశానవాటి విశ్వజనీనమైన ప్రణయం అలవర్చుకున్నవారికి మరాళ తూలికాతల్పం.

అన్వే :-మీమాటలు నాకు అతిఆనందం కలిగిస్తున్నాయి.

స :-కష్టభూయిష్టమైన ప్రపంచం చూసేసరికి పూలపాన్పు 'శాక్యఋషి' కి కరకురాయి అయిపోయింది; కటికవానికత్తికి బలిఅయిపోయిన చిరుమేక కన్నీటిచుక్కలు, రాజ్యాధికారి హృదయం దహించే విషకణాలుగా మారిపోయినవి.

అ :-చిత్తం! (రుద్ధకంఠం) నాగుండె కరిగిపోతూంది.

స :-హింసతోనిండిన పట్నం అడివిగాను-నిశ్శబ్దం- నిరోగం- హింసాదూరం అయిన విజనపథం ఊరుగాను అగుపించింది వారికి—కనక యిక్కడ పడుకోవచ్చా అని మీరు అడగవలసిన అవసరం లేదు- నిర్భయంగా పడుకోవచ్చు (ఆవలిస్తూ-చిటికలువేస్తూ) ఈ శాలీ పరుచుకోండి...

...అలిసి వచ్చాడులా వుంది. మంచి నీరైనా త్రాగకుండా నిద్రపొయ్యాడు.

(రాత్రి నిశ్శబ్దం)

(స్త్రీకంఠం)

'ఏయ్‌ఏయ్ !'

'ఎందుకొచ్చావు ?'

'ఎందుకా! ఎందుకా !'

'ఆఁ! ఎందుకూ ?'

'నా మాటేం జెప్పావు'

'నాకు తెలీదు'

'ఎలా తెలుస్తుంది! నువ్వు హంతకుడివి. బౌద్ధసన్యాసివి కావు! నేను నిహతని-సన్యాసినిని కాను. నన్ను మోసంచేసి నాకొంప తీస్తావా! నా కేదైనా దారి చూపించవా ?'

'ఏం చెయ్యమన్నావు ?'

'దారి చూపించు'

'నా చాతకాదు'

'చాతకాదూ - గోలచేస్తా-నిన్ను నలుగురిలోకి యీడిచి అవమానపరుస్తా-నన్ను బలాత్కరించి నా పీకమీదకి తెచ్చావు.'

'అందుకు నేను బాధ్యుణ్ణికాను.'

'మరెవరు'

'బుద్ధదేవుడు'

అన్వే:- నా కళ్ళల్లో శక్తిలేకపోయినా యీ పాపాలయంనుంచి పరుగెత్తిపోవాలి. హరహర! అపమార్గం తొక్కించావా మళ్ళీ. ఇంకా తెల్లవారలేదు...నక్షత్ర కాంతిలో దారి సమంగా కానరావడంలేదు...ఆహా...పరమేశ్వరా...నాకు మరి దారిచూపించవు కాబోలు, చలి చలి...... ఊహుహుహు...చలి...ప్రభాతం అనుకున్నాను. ఎదురుగుండా ఆకాశంలోకి దూసుకుపోయిన మంచు కొండ కొసలనిచూసికూడా ఎంతదూరం వచ్చానో పోల్చుకోలేని హృదయ వేదనలోపడిపోయాను. తీర్థాలు సేవించడానికి వచ్చిన అరుణాస్పదవాసివలె, సత్యాన్వేషణం నిమిత్తం యీ భయంకర హిమవత్పర్వతప్రాంతాలకే వచ్చాను. కాని నా కంటికి 'కలశధారాహతి' 'జేగురైన' చోటులు కానరావు. 'పున్నాగ నారంగ రంభా' వృక్షా లసలే కానరావు. ఇదంతా గడ్డకట్టిన సముద్రంలావుంది. మానవ సంచారం కించిత్తైనా లేని యీ కానన ప్రదేశంలో తపస్సుచేస్తే ఈశ్వర దర్శనం కావచ్చు. ఔనౌను — పూర్వం విశ్వామిత్రుడు మొదలైన ఋషులు యిక్కడే తపస్సు చేసి కృతార్థులయ్యేరు కదూ.

ఆహాహా! అననుగమ్యం అయిన యీ అటవీమార్గంలో, మధ్యమధ్య వికారమైన గోళాలవలెనున్నవి యేమిటో అనుకున్నాను. వీరెవరో మహర్షులు. కాలిగోళ్లు చేతులగోళ్లు ఏకమై - గడ్డాలు నేలను తాకుతూ-నిశ్చల తపస్సమాధిలోవున్నారు. వీరే నాకు శరణ్యులు. ఇక్కడకూచుని, యీ దాపు నేవున్న మునీశ్వరుడు ఎప్పుడుకన్ను తెరిస్తే అప్పుడే నమస్కరించి ఈశ్వర సన్నిధానానికి సుమార్గం సంపాదిస్తా...అదిగో నాపుణ్యమా అని అతడు కళ్ళు తెరిచాడు.(సాష్టాంగపడి)తండ్రీ!నాకు నీకంటె వేరే దిక్కులేదు...నన్ను తరింపజెయ్యవా!

ఋ :-ఎవరు నువ్వు!

అన్వే :-నేనొకమానవుణ్ణి. ప్రపంచంమీద విసికి, కినిసి, రోసి- ఈశ్వర దర్శనంకోసం పరిభ్రమిస్తూ, అన్నిఆశలూ చెల్లిపోగా యిక్కడికి వచ్చాను.

ఋ :-(పెద్దగా నవ్వి) ఈశ్వర దర్శనానికా!

అన్వే :-చిత్తం-ఏం అలానవ్వుతున్నారు?

ఋ :-(తిరిగి పక్కున నవ్వి) నీకా!!!

అన్వే : -(నెమ్మదిగా, ముఖం చిన్నబుచ్చుకు) క్షమించండి.

ఋ :-ఓ ి వెఱ్ఱివాడా- ఈప్రాంతంలోవున్న వారందరికన్న వెనక వచ్చినవాడిని- చిన్నవాడిని నేను-వీరెవ్వరికీ 'ఈశ్వరం' అంటే ఏమిటో యింకా బోధపడలేదు- నాకింత వేగం ఆశే లేదు.

అన్వే :-(తిరోగమిస్తూ) అయితే నేను నిరాశతో పోవలసిందే - (నడుస్తూ) నా ప్రయత్నం నిష్ప్రయోజనం అయినట్టే. పరబ్రహ్మం చేరడానికి అనువైన మార్గంలేదు కామోసు. నా హృదయారాటంతీరే మార్గంలేదూ? ఇంకేది దిక్కు! ఓ ఈశ్వరా! చివరకి నువ్వే నెగ్గినట్టుంది, నేనే ఓడినట్టుంది.

అహాహ! ఇదేం చిత్రం-చూస్తూండగానే, తుహినాచలం వూరుగా మారిపోయింది! చక్కనైన తోటలు, సొగసైన మేడలు-అంతా మా వూరువలెనే వుంది. నిజం నిజం-మావూరే-అదిగో మా యిల్లు-గుమ్మంలో మా చిన్నవాడు బిక్కపోయిన మొగంతో నన్ను చూస్తున్నాడు. అహాహా! కళ్ళు యింతలుచేసి పరుగెత్తుకుని వస్తూన్నాడు. ఈ మతోన్మాదుకిని-ఈ దేశద్రిమ్మరిని- ఈ సంసార ద్రోహిని పోల్చుకున్నాడు.

అన్వేషికొడుకు :-నాన్నా! నాన్నా! ఎంత కాలానికి వచ్చావు! రా! అమ్మ నీకోసం బెంగ పెట్టుకుంది!

అన్వే :-అలాగా నాయనా (కన్నీరు) బెంగ...పెట్టుకుందా! నన్ను క్షమిస్తుందా... అదిగో......(దగ్గుత్తిక) మంచానికి అంటుకుపోయింది.

అన్వేషి భార్య :-వచ్చారా! వచ్చారా! నాకు తెలుసును. నమ్మకంవుంది....బాబునడగండి నేనేం అంటూండేదాన్నో.

అన్వే :-అబ్బ! నాకు బ్రహ్మానందంగావుంది. ఈశ్వరుడి నిమిత్తం దేశదేశాలు తిరిగానుగాని ఎక్కడా యింత ఆనందం లభించలేదు...ఇక్కడ ...ఇంటి దగ్గర...లభించింది. నేనే గెలిచాను!